అభివృద్ధి చేసేందుకు అవకాశమివ్వండి

• వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



కోనరావుపేట: మామిడిపల్లిలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట/కథలాపూర్: వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, కథలాపూర్ మండలం సిరికొండ, కథలాపూర్, గంభీర్‌పూర్, తాండ్ర్యాల, ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టసుఖాల్లో ప్రజల మధ్య ఉన్న తనను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోనరావుపేట మండలం కోనసీమగా మారుస్తామని, సిరికొండ–తక్కళ్లపెల్లి బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని చెప్పి ఒక పని చేయలేదన్నారు. ఇక్కడి ప్రజల సమస్యలను గాలికి వదిలేసి విదేశాల్లో విలాసాల్లో మునిగితేలారని మండిపడ్డారు. కథలాపూర్ మండలంలో పేదలకు డబుల్ బెడ్రూం



కథలాపూర్: సిరికొండలో ఓటు అభ్యర్థిస్తున్న ఆది

ఇళ్లు నిర్మించకుండా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కాలయాపన చేసి మోసం చేశారని, ఇటువంటి బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, ఉపసర్పంచ్ రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆదికి రూ.1.75 లక్షల ఆర్థికసాయం

వేములవాడరూరల్: వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు వేములవాడ రూరల్‌మండలం లింగంపల్లి గ్రామస్తులు రూ. 1.75 లక్షల నగదు అందజేసి మద్దతు తెలిపారు.

వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

• వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మాట్లాడుతున్న వికాస్‌రావు, ప్రచారరథంపై డాక్టర్ దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



నాగారంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్న వికాస్‌రావు సోదరి వినయ

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి, తిప్పాపూర్‌లో 11, 24వ వార్డులో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్ అన్నారం ఉమారాణి, డాక్టర్ దీప పాల్గొన్నారు. గత పాలకులెవ్వరూ వేములవాడ అభివృద్ధిని పట్టించుకోలేదని, ఇప్పుడేమో తాను దత్తత తీసుకుంటానని చెప్పడం సిగ్గుచేటన్నారు. నాంపల్లిలో గతంలో నిరుపేదలకు ఇచ్చిన భూములను ప్రభుత్వం తిరిగి తీసుకుందని అన్నారు. వేములవాడ ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే నాయకుడికి పట్టం కట్టాలని ఆయన కోరారు.

అడ్వకేట్లతో సమావేశం

వేములవాడ బార్ అసోసియేషన్‌లో శుక్రవారం అడ్వకేట్లతో వికాస్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించి మద్దతు ఇవ్వాలని కోరారు.

అన్న కోసం చెల్లెలు ప్రచారం

కోనరావుపేట: మండలం నాగారంలో వికాస్‌రావు తరఫున ప్రచారం చేసేందుకు అమెరికాలో నివాసముంటున్న ఆయన సోదరి వెన్నమనేని వినయ, బావ శ్రీధర్‌రావు, కోడలు రియాలు వచ్చారు.

బీజేపీలో చేరిక

కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన రెడ్డి సంఘం అధ్యక్షుడు కస్తూరి సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు చల్ల వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కస్తూరి రణధీర్‌రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు సీహెచ్ విద్యాసాగర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

ఇంటింటి ప్రచారం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, దుంపేట, తాండ్ర్యాల గ్రామాల్లో వికాస్‌రావుకు మద్దతుగా జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్మల వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహించారు.

క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేయాలి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యే రమేశ్‌బాబు, అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

• సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి
• చల్మెడను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి
• రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ క్యాడర్ క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేయాలని, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నివాసంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, మండల, గ్రామశాఖ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న వేములవాడలో సీఎం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అన్ని స్థాయిల క్యాడర్ జన సమీకరణ బాధ్యతలను తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబుల సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనుల జరిగాయనీ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మాజీ ఎంపీపీ

చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు అభ్యర్థి



కోనరావుపేటలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చల్మెడ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బొట్టుపెట్టి ఓటు అడిగి..

బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ సతీమణి సునీల శుక్రవారం వేములవాడలో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, పార్టీ మహిళలు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ప్రచారం

కోనరావుపేట: మండలంలోని కోనరావుపేట, సుద్దాల, కనగర్తి, మామిడిపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోకల రేఖ, ఎంపీటీసీ చారి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, చల్మెడ మధుసూదన్‌రావు, కొక్కుల నర్సయ్య, రాజు, మాజీ ఎంపీటీసీ కులేరు రవి, కులేరు శ్రీనివాస్, పోకల సంతోష్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. న్యాయవాదుల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకే ఇస్తున్నామని ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, న్యాయవాది తంగళ్లపల్లి వెంకట్ అన్నారు. న్యాయవాదులు కర్రోల్ల శంకర్, లక్కం కిషోర్, బర్ల శ్రీనివాస్, అక్కెనపల్లి అజయ్, అక్కెనపల్లి ప్రశాంత్, వెంకట్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

• సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: బైపాస్‌రోడ్డులో భూములు కోల్పోయిన వెంకటాపూర్ రైతులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారంలోకి రాగానే ముందుగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామన్నారు. గ్రామంలో నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని, ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. మళ్లీ కొత్త హామీలతో ప్రజల ముందుకొస్తున్నారని, వాళ్లను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన ప్రజల నుంచి స్పందన వస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో తాను గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్, జిల్లా కార్యదర్శులు పందిర్ల లింగంగౌడ్, వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు రాజునాయక్, పొన్నాల మల్లారెడ్డి, దేవచంద్రన్, బాలయ్య, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత తీసుకున్నా అభివృద్ధి జాడేది?



రామన్నపల్లిలో మాట్లాడుతున్న రాణిరుద్రమ

• సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ

తంగళ్లపల్లి: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దత్తత తీసుకున్న గ్రామమంటే ఎంత అభివృద్ధి చెందాలి? కానీ తండ్రి కొడుకులిద్దరూ కలిసి దత్తత తీసుకున్న రామన్నపల్లి గ్రామంలో అభివృద్ధి జాడ ఎక్కడా కనిపించడం లేదని బీజేపీ సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థి రాణిరుద్రమ ఎద్దేవా చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని రామన్నపల్లి, బస్వాపూర్, తాడూర్, గోపాల్‌రావుపల్లె, పాపయ్యపల్లె, చీర్లవంచ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను రైతు బిడ్డనని రైతుల కష్టనష్టాలు తెలుసన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తూకంలో మోసం చేస్తుంటే ఎన్నడైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించాడా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రం సొంత డబ్బా కొట్టుకుంటుందని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సిరిసిల్లకు టెక్స్‌టైల్ క్లస్టర్ ఏర్పాటు చేసి నేతన్నలకు ఉపాధికల్పిస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో సిరిసిల్ల ఎమ్మెల్యే స్థానం మహిళలకు రిజర్వు కాబోతోందని కేటీఆర్‌లాంటి వాళ్లు బిస్తర్ సర్దుకొని వెళ్లాల్సిందే అన్నారు. బీజేపి పార్టీ అధికారంలోకి వస్తే బీసీని సీఎంను చేస్తామని అన్నారు. బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు శీలం రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సందెవేని రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పరమపదోత్సవం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా పరమపదోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిత్యాభగవతారాధన, దివ్య ప్రబంధ అనుసంధానం, నివేదన, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు భగవతారాధన, ద్రావిడ దివ్యప్రబంధ సేవాకాలం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 25 శనివారం నిర్వహించే శ్రీ రుక్మిణీ–సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణానికి ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ఆలయం నుంచి స్వామి వారి ఎదుర్కోళ్లు, 11 గంటలకు కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సాఫ్ట్ స్కిల్స్‌తో ఉపాధి అవకాశాలు

ముస్తాబాద్: డిగ్రీ చదివే విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ నైపుణ్యాన్ని సాధించి, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాస్ అన్నారు. కళాశాలలో విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టాస్క్ ఆధ్వర్యంలో కేరీర్ గైడెన్స్‌పై శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. డిగ్రీ పూర్తి చేసుకున్న వెంటనే ఇతరులపై ఆధారపడకుండా టాస్క్‌లో శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు టాస్క్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. టాస్క్ రిలేషన్ మేనేజర్ గంగప్రసాద్,



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ దాస్

ప్రాజెక్టు మేనేజర్ ప్రవరాఖ్య, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, సీనియర్ లెక్చరర్లు శ్రీవల్లి, ఆంజనేయులు, ఆదివిష్ణు, ధర్మపురి, వాణి, బిక్షమయ్య, మనోహర్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న వలంటీర్లు

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానంతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ సేవా పథకం ద్వారా లక్షల మంది వలంటీర్లు సేవలందిస్తున్నారని, సమాజం పట్ల వారికున్న అభిమానం గొప్పదన్నారు. సేవా పథకం ద్వారా విద్యార్థులకు సేవా భావంతో పాటు శ్రమ విలువ తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన కారు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై పక్కన చెట్ల పొదల్లోకి శుక్రవారం టాటా జెస్ట్ టీఎస్ 21డీ2343 నంబర్ గల కారు దూసుకెళ్లింది. రోడ్డుపక్కన ఉన్న చెట్లను ఢీకొడుతూ రోడ్డు కిందకి దూసుకుపోవడంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. వారంత వారే అక్కడి నుంచి వెళ్లిపోయారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

• కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: డాక్టర్ వృత్తిలో కొనసాగుతూ కూడా ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చింగుట్ట, అంబాల్‌పూర్, మొలంగూర్ గ్రామాల్లో పర్యటించారు. గోసిగొంగడితో వచ్చి రసమయి బాలకిషన్ వందల కోట్లు సంపాదించాడని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టివ్వకుండా మభ్యపెడుతూ మోసం చేశారని ఆరోపించారు. ఊరి, ఇంటి పేరు తెలియకుండానే రెండుసార్లు గెలిపిస్తే కోట్లు సంపాదించి ఫాంహౌజ్ కట్టుకున్నాడన్నారు. చింతలపల్లి మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా.. కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని పలువురు వైద్యులు మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు బసవయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రహీం, రాజిరెడ్డి, తిరుపతి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను విస్మరించిన బీఆర్‌ఎస్

మానకొండూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలను పట్టించుకోలేదని, ముస్లింలను విస్మరించిందని ఉమ్మడి రాష్ట్ర మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖుస్రోపాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన ముస్లిం మేనిఫెస్టో ఉపయోగకరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో మండలంలో నిర్మించిన షాదీఖానా నిర్మాణం మధ్యలోనే నిల్చిపోయిందన్నారు. కవ్వంపల్లి మాట్లాడుతూ.. మైనార్టీలకు ప్రకటించిన మేనిఫెస్టోకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన ముస్లింలకు కవ్వంపల్లి కృతజ్ఞతలు తెలిపారు. రంగపేటకు చెందిన రెడ్డి సంఘం నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రవీంద్రచారి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, బక్కారెడ్డి, సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖుస్రోపాషా

ఒక్కసారి అవకాశమివ్వండి

కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం



ప్రచారం చేస్తున్న మేడిపల్లి సత్యం



రాజుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మేడిపల్లి సత్యం

మల్యాల: చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ పదేళ్లుగా ప్రజల మధ్యే ఉంటున్నానని, ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమివ్వాలని కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కోరారు. నూకపల్లి, రామన్నపేట, బల్వంతాపూర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇంటింటా అమలు చేస్తామని, తెలంగాణ ఉద్యమకారుడిగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి అయిన తనకు అవకాశమివ్వాలన్నారు. ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, శోభారాణి, ఆదిరెడ్డి, మారంపల్లి లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్, జలం, నర్సింహారెడ్డి, మిస్త్రీ శ్రీను, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్‌విండో వైస్ చైర్మన్

రామడుగు: కొక్కెరకుంట సింగిల్‌విండో వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు సుద్దగోని రాజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సత్యం కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ వైస్ చైర్మన్ శంకరయ్య, డైరెక్టర్లు రాజు, లక్ష్మీ, మల్లయ్య, నారాయణ, మల్లేశం, రాజు, నాగేంద్ర, మధుసూదన్ పార్టీలో చేరారు. నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తులసి దామోదర కల్యాణం

వీర్నపల్లి: మండల కేంద్రంలో తులసి దామోదర కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూజ కార్యక్రమాలను నిర్వహించి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



పూజలో పాల్గొన్న భక్తులు

డీజేలకు అనుమతి లేదు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలో డీజేలు పెట్టేందుకు ఎవరికీ అనుమతి లేదని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనుమతిలేని డీజేలు ఎవరు పెట్టినా వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో బైండోవర్ చేసిన డీజే నిర్వాహకులు డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల డీజే నిర్వాహకులు పాల్గొన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ వాహనం తనిఖీ

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ పరిసరాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వాహనాన్ని శుక్రవారం రాత్రి ఎస్సై మామిడి మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీకి ఎమ్మెల్యే సహకరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899